క్లుప్తంగా

పెదకాకాని ఎంఈఓగా సత్యనారాయణమూర్తి



పెదకాకాని: మండల నూతన విద్యాశాఖాధికారిగా జి. సత్యనారాయణమూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన డి. బలిరాం ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో వట్టిచెరుకూరు మండల విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న జి సత్యనారాయణమూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను పెదకాకాని– 2 ఎంఈఓ వి. శంకరరాజు, ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు ఎం. శంకర్‌రావు, ఎం. దేవపాల్, పి శ్రీనివాసరావు తదితరులు స్వాగతం పలికారు. శాలువతో ఘనంగా సత్కరించారు.

ప్రెసిడెన్సీలో రతన్‌టాటాకు నివాళి



చేబ్రోలు: పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా మరణం పారిశ్రామిక రంగంతో పాటు ఈ దేశానికి తీరని లోటు అని ప్రెసిడెన్సీ హైస్కూల్ డైరెక్టర్ వాసిరెడ్డి బస్‌బాబు అన్నారు. చేబ్రోలులోని ప్రెసిడెన్సీ హైస్కూల్‌లో గురువారం రతన్‌టాటాకు నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి ప్రెసిడెన్సీ డైరెక్టర్ బస్‌బాబు, స్కౌట్స్ విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బస్‌బాబు మాట్లాడుతూ రతన్‌టాటాను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విలువలతో కూడిన వ్యాపారాలను దేశ విదేశాల్లో విస్తరించిన దార్శనికుడు రతన్‌టాటా అన్నారు. పీఈటీ, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

తాడేపల్లిరూరల్ : డిగ్రీ విద్యార్థులకు, నిరుద్యోగులకు మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు వంగర సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, ఎన్‌టీఆర్, పశ్చిమ గోదావరి జిల్లాల వారికి 22 సంవత్సరాలకు పైగా అనుభవం గల సాప్ ప్రాజెక్ట్ మేనేజర్‌తో ఎస్‌ఏపీ ఎస్డీలో శిక్షణ ఇవ్వనున్నామని, శని, ఆదివారాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్నామని తెలిపారు. వివరాలకు 93937 71663, 99852 22857, 70935 29750 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

వచ్చిందే సమయం.. చేసిందే వైద్యం

- సమయపాలన పాటించని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సిబ్బంది
- గ్రామీణ ప్రాంత ప్రజలకు సకాలంలో అందని వైద్యసేవలు
- వ్యాధుల వేళ పల్లెల్లో అందుబాటులో ఉండని సిబ్బంది



ప్రత్తిపాడు మండలం కొత్తమల్లాయపాలెంలో గురువారం ఉదయం 10.30 గంటలకు మూసివేసి ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్

ప్రత్తిపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవల్ని అందించాల్సిన ఆరోగ్య ఉపకేంద్రాలకు నిర్లక్ష్య గ్రహణం పట్టింది. ఎంఎల్‌హెచ్‌పీలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. సమయపాలనకు చరమగీతం పాడుతుండటంతో సబ్‌సెంటర్లు సమయానికి తెరుచుకోవడం లేదు. జ్వరాలు, జలుబులు ముసురుతున్న వేళ సబ్‌సెంటర్లు మూసి వేసి స్వాగతం పలుకుతుండటంతో పల్లె ప్రజలు చిన్నపాటి వైద్యానికి సైతం మండల కేంద్రానికి పరుగులు పెట్టాల్సి వస్తోంది. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు మండలంలో 12, పెదనందిపాడు మండలంలో 13, కాకుమాను మండలంలో 13, వట్టిచెరుకూరు మండలంలో 13, గుంటూరు రూరల్ మండలంలో 8 చొప్పున మొత్తం 59 విలేజ్ హెల్త్ క్లినిక్స్ (సబ్ సెంటర్లు) ఉన్నాయి. వీటిని కూటమి ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లుగా మార్చుచేసింది. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల బాధ్యతలను ప్రభుత్వం ఎంఎల్‌హెచ్‌పీలకు అప్పగించింది. వీరు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కచ్చితంగా సబ్‌సెంటర్లను తెరిచి ఉంచి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలి. కానీ వారు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో.. కూడా తెలియని పరిస్థితి క్షేత్ర స్థాయిలో చోటుచేసుకుంటుంది. పూర్తిగా ఎంఎల్‌హెచ్‌పీలపై ఉంది. వీరి పనితీరుతో పాటు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల నిర్వహణను ప్రాథమికంగా పర్యవేక్షించాల్సిన సూపర్‌వైజర్లు గ్రామాలకు చుట్టం చూపుగా వెళుతున్నారు.

చుట్టం చూపుగా గ్రామాలకు సూపర్‌వైజర్లు

మెడికల్ ఆఫీసర్లు తనిఖీలకు మంగళం పాడేశారు. ఇక జిల్లా ఉన్నతాధికారులైతే ఆకస్మిక తనిఖీలు చేసిన సందర్భాలే లేవు. దీంతో ఎంఎల్‌హెచ్‌పీలు వచ్చిందే సమయం.. చేసిందే వైద్యం అన్నతీరుగా మారిందన్న విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. మండలంలోని ఎంఎల్‌హెచ్‌పీల్లో ఒకరిద్దరు మినహా మిగిలిన వారెవ్వరూ స్థానికంగా పనిచేసే చోట నివాసం ఉండటం లేదు. పర్యవేక్షించాల్సిన మండల స్థాయి సూపర్‌వైజర్లు, మెడికల్ ఆఫీసర్లు నివాసాలు కూడా గుంటూరు కావడంతో ఏ ఒక్కరూ సమయానికి రాని పరిస్థితి. దీంతో ఉదయం పదిన్నర పదకొండు గంటలకు కూడా సబ్‌సెంటర్లు తెరుచుకోని పరిస్థితి. మరికొంద రైతే మధ్యాహ్నానికే కేంద్రాలకు తాళాలు వేసి వెళ్లిపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉదయం తొమ్మిది గంటలకు తెరవాలి

ఉదయం తొమ్మిది గంటలకు గ్రామాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు తెరవాలి. సాయంత్రం నాలుగు గంటల వరకు ఎంఎల్‌హెచ్‌పీలు అందుబాటులో ఉండి ప్రజలకు గ్రామంలోనే మెరుగైన వైద్య సేవలు అందించాలి. ప్రతి ఒక్కరూ కచ్చితంగా సమయపాలన పాటించాలి.

–మేరి యునిస్ (వైద్యాధికారి, గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)

ఆరోగ్య సిబ్బంది జాడ కరువు

వ్యాక్సినేషన్ రోజులు, ఎఫ్‌పీసీ రోజుల్లో మినహా మిగిలిన రోజుల్లో ఆరోగ్య సిబ్బంది జాడలే గ్రామాల్లో కనిపించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అసలే వ్యాధుల కాలం.. పూర్తి అప్రమత్తంగా ఉండాల్సిన వేళ.. మూసి వేసిన ఉపకేంద్రాలు రోగులకు ఉపశమనాన్ని కలిగించలేకపోతున్నాయి. గ్రామాల్లో జ్వరాలు, జలుబు, దగ్గు వంటి రోగాల బారిన పడినవారు గత్యంతరం లేని పరిస్థితుల్లో స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీల వద్దకో లేక మెడికల్ షాపుల వద్దకో వెళ్లి మందులు కొనుక్కుంటున్నారు.

14 నుంచి గ్రామాల్లో పల్లె పండుగ



ప్రత్తిపాడు: పల్లె పండుగ కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో నిర్వహించాలని ఎంపీడీవో కె. శివపార్వతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 14 నుంచి 20వ తేది వరకు పల్లె పండుగ పేరుతో పంచాయతీ వారోత్సవాలను నిర్వహిస్తుందన్నారు. అందులో భాగంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న పనులకు శంకుస్థాపనలను గ్రామాల్లో చేపట్టాలని తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పంచాయతీ అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది పూర్తి చేయాలని ఆదేశించారు.

మండలానికి రూ. 60 లక్షలు

ప్రత్తిపాడు మండలంలో సీసీ రోడ్లు నిర్మించేందుకు ఉపాధిహామీ పథకం కింద రూ. 60 లక్షలు మంజూరయ్యాయని ఎంపీడీవో శివపార్వతి తెలిపారు. గనికపూడికి రూ. 10 లక్షలు, ప్రత్తిపాడుకు రూ.28 లక్షలు, తిక్కిరెడ్డిపాలేనికి రూ.18 లక్షలు, పెదగొట్టిపాడుకు రూ. 10 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఆయా నిధులతో గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు వివరించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా, పీఆర్ ఏఈ రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొందరికే దసరా కందిపప్పు..!

పూర్తిస్థాయిలో కార్డుదారులకు చేరని వైనం



రేషన్ తీసుకుంటున్న ప్రజలు

పొన్నూరు: అసలే నిత్యావసర సరకుల ధరలు నింగిని తాకటంతో బెంబేలెత్తుతున్న సామాన్య ప్రజలకు కూటమి ప్రభుత్వం మరింత ఇబ్బందులు పెడుతోంది. రేషన్ కార్డుదారులకు చౌక దుకాణాల ద్వారా దసరా పండుగకు కందిపప్పు అందిస్తామని చెప్పిన మాట పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోకపోవడంతో ప్రభుత్వ పనితీరుపై జనం మండి పడుతున్నారు. ప్రజా పంపిణీ నిమిత్తం రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు అరకొరగా కందిపప్పు అందించడంతో వారు ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో అవస్థలు పడుతున్నారు. సుమారు ఒక డీలరుకు 600 నుంచి 800 మంది కార్డుదారులు ఉండగా 40 శాతం కందిపప్పు మాత్రమే స్టాక్ పాయింట్ల నుంచి సరఫరా అయినట్లు సమాచారం. కార్డుదారులకు ఒకరికి ఇచ్చి మరొకరికి ఇవ్వకపోతే వివాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని డీలర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం అందించిన కొద్దిపాటి కందిపప్పు కార్డుదారులకు చేరకుండా పక్కదారి పట్టే అవకాశాలు లేకపోలేదని పలువురు చెబుతున్నారు.

పూర్తిస్థాయిలో కార్డుదారులకు అందని కందిపప్పు

బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధర కిలో రూ.160 నుంచి రూ.180 వరకు పలుకుతోంది. కూటమి ప్రభుత్వం రూ.67కే కిలో కందిపప్పు అందిస్తామని ప్రకటించింది. కానీ పూర్తిస్థాయిలో కందిపప్పు అందించకుండా రేషన్ దుకాణాలకు 40 శాతం మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుంది. దీంతో రాయితీ కందిపప్పు కోసం కార్డు దారులు చౌక దుకాణాలు, ఎండీయూ వాహనాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. కార్డుదారులను ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వ పనితీరు పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చౌక దుకాణాలకు 40 శాతం మాత్రమే సరఫరా

కందిపప్పు 40 శాతం మాత్రమే కేటాయింపు జరిగింది. చౌక దుకాణాలకు 21 టన్నుల కందిపప్పు మాత్రమే అందించాం. పొన్నూరు పట్టణం, రూరల్, కాకుమాను మండలాలకు కేటాయించాం. మరో విడతలో పూర్తిస్థాయిలో కార్డుదారులకు కందిపప్పు కేటాయింపు జరగనుంది.

–శోభ, ఇన్‌చార్జ్, ఎంఎల్‌ఎస్ పాయింట్

పంచాయతీ గుమస్తా అక్రమ వసూళ్లు

ఒక్కో పారిశుధ్య కార్మికుడి వద్ద రూ.1000లు వసూలు

పెదకాకాని: పారిశుధ్య కార్మికుల వద్ద పంచాయతీ గుమస్తా అక్రమంగా నగదు వసూలు చేస్తున్నాడని గురువారం పలువురు కార్మికులు వాపోయారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన పంచాయతీ గుమస్తా ప్రభు 20 రోజులుగా చెత్త తరలించే ట్రాక్టర్ డ్రైవర్‌ను విధుల్లోకి రాకుండా అడ్డుకుంటున్నాడు. పారిశుధ్య కార్మికుల టెండర్ల సమయంలో డీఎల్‌పీఓ కార్యాలయంలో నగదు చెల్లించాలని ఒక్కొక్కరి వద్ద వెయ్యి రూపాయల చొప్పున వసూలు చేసినట్లు ఆరోపించారు. టెండర్ల సమయంలో ఇచ్చిన వెయ్యి రూపాయల్లో ఒక ఒరిజినల్ టెండర్‌కి రూ.200 రూపాయలు, డమ్మీ టెండర్‌కు రూ.200లు చొప్పున తీసుకుని రూ.600లు తిరిగి ఇవ్వాలని ట్రాక్టర్ డ్రైవర్ ఆళ్ల రాఘవరెడ్డి గుమస్తాను కోరడంతో వివాదం మొదలైంది. డబ్బులు అడగటంతో కక్ష కట్టిన గుమస్తా విధుల్లోకి రానీయకుండా అడ్డుకుంటున్నాడని బాధితుడు పేర్కొన్నాడు. దీనిపై సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లును కలిసి రాష్ట్ర మంతటా పారిశుధ్య కార్మికులను సత్కరించి అభినందిస్తుంటే వెనిగండ్లలో పారిశుధ్య కార్మికులను గుమస్తా ప్రభు వేధిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. పంచాయితీ పాలకవర్గంతో చర్చించి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

మహిళల రక్షణకు దేశంలో ప్రత్యేక చట్టాలు



మహిళలకు అందిస్తున్న గుర్తింపు కార్డులు

ప్రత్తిపాడు: మహిళల రక్షణకు దేశంలో ప్రత్యేక చట్టాలున్నాయని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం దళిత బహుజన రిసోర్స్ ఆధ్వర్యంలో మహిళా హక్కులు, రక్షణ చట్టాలపై ఎస్సీ,ఎస్టీ మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీబీఆర్సీ ఏరియా కోఆర్డినేటర్ కూరపాటి నిర్మల అధ్యక్షతన జరిగిన సమాదేశంలో ముఖ్య అతిథిగా హాజరైన చిన్నప్ప మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఎంపీడీవో శివపార్వతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శి ఉషారాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు నిరోధానికి, అక్రమ రవాణాను అరికట్టేందుకు, పని ప్రదేశంలో మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలున్నాయని తెలిపారు. లైంగిక వేధింపులు, గృహహింస, దిశ చట్టం, ఎస్సీ,ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాల గురించి మహిళలకు వివరించారు. అనంతరం భవన నిర్మాణ మహిళా కార్మికులకు గుర్తింపు కార్డులను అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి పాల్గొన్నారు.

పల్లెల్లో మైక్రో పడగపై విచారణ

- ప్రత్తిపాడులో బాధితుల స్టేట్‌మెంట్లు రికార్డ్
- మహిళలను వేధిస్తే ఉపేక్షించేది లేదు
- డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ విజయలక్ష్మి హెచ్చరిక

సాక్షి ఎఫెక్ట్



మహిళల నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేస్తున్న ఏపీఎం వి. లాజరు, సీసీ పూర్ణయ్య

ప్రత్తిపాడు: మైక్రో ఫైనాన్స్ సంస్థలు మహిళలను వేధింపులకు గురి చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి హెచ్చరించారు. ఈఎంఐలు కట్టలేదని ప్రత్తిపాడు వడ్డెర కాలనీకి చెందిన మహిళలను మైక్రో ఫైనాన్స్ సంస్థలు అర్ధరాత్రి వచ్చి తలుపులు కొట్టి వేధించడంతోపాటు చచ్చిపోతే ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసుకుని రుణం క్లోజ్ చేసుకుంటామంటూ దాష్టీకానికి పాల్పడుతున్నారు. ఈ వివరాలతో ఈ నెల 9వ తేదీన 'సాక్షి'లో 'మళ్లీ పల్లెల్లో మైక్రో పడగ' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. దీంతో గురువారం ఉదయం ప్రత్తిపాడు ఏపీఎం వి.లాజరు, సీసీ పూర్ణయ్య కలిసి వడ్డెర కాలనీలోని బాధిత మహిళల వద్దకు వెళ్లారు. పూర్తి వివరాలను సేకరించారు. అనంతరం వారి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. అనంతరం ఏపీఎం లాజరు వారికి భరోసానిచ్చారు. ప్రభుత్వం అండగా ఉంటుందని సూచించారు. స్త్రీనిధి ద్వారా వ్యక్తిగతంగా రుణాలిస్తామని చెప్పారు. వేధించిన వారిని తీసుకుని నివేదికతో గుంటూరులోని డీఆర్‌డీఏ కార్యాలయంలో పీడీని కలిశారు. ఈ సందర్భంగా ఆమె వారితో చర్చించారు. వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీవోఏలతో మాట్లాడి ఇలాంటి ఫైనాన్స్ కంపెనీల వివరాలతో మరో నివేదిక అందజేయాలని ఏపీఎంను ఆదేశించారు.

ప్రత్తిపాడులో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న విద్యుత్ అధికారులు

ప్రత్తిపాడు: విద్యుత్ విజిలెన్స్ అధికారులు గురువారం ప్రత్తిపాడులో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సెక్షన్‌లోని పెదగొట్టిపాడు, గనికపూడి, కొత్తమల్లాయపాలెం, పాతమల్లాయపాలెం, బొర్రావారిపాలెం, మేడావారిపాలెం , తిమ్మాపురం, తుమ్మలపాలెం, యనమదల గ్రామాల్లో 36 మంది అధికారులు, 105 మంది సిబ్బంది 35 బృందాలుగా ఏర్పడి 2,511 సర్వీసులను తనిఖీ చేశారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషనులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఈఈ సీహెచ్ రమేష్‌లు వివరాలను వెల్లడించారు. మీటరు లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఒకరికి రూ. వెయ్యి, మీటరు ఉండి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరికి రూ. 7 వేలు, అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతర కేటగిరీల్లో విద్యుత్ వినియోగిస్తున్న ఆరుగురికి రూ. 17 వేలు, అదనపు లోడ్ వినియోగిస్తున్న 65 మందికి రూ. 2.32 లక్షల చొప్పున మొత్తం రూ. 2.57 లక్షల అపరాధ రుసుంలు విధించినట్లు ఈఈలు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేలా చూడాలని సూచించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే మొదటిసారి అపరాధ రుసుం, రెండోసారి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతామని తెలిపారు. తనిఖీల్లో డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

రేపు 'ధ్యాన దసరా' ఉచిత వర్క్‌షాప్

తాడేపల్లిరూరల్ : మానస సరోవర్ ధ్యాన ఆశ్రమంలో ధ్యాన దసరా పేరిట ఉచిత వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు కళ్ళం రామిరెడ్డి గురువారం తెలిపారు. తాడేపల్లి బైపాస్ రోడ్డులో మణిపాల్ హాస్పటల్ దగ్గర కృష్ణానది తీరాన నిర్మించిన మానస సరోవర్ ధ్యాన ఆశ్రమంలో 12, 13 తేదీల్లో నిర్వహించనున్నామని తెలిపారు

అమ్మలగన్న అమ్మ.. కనకదుర్గమ్మ..!



కొత్తరెడ్డిపాలెం కనకదుర్గాదేవి విగ్రహం ఎదురుగా శివలింగాకారంలో దీపాలను వెలిగించిన భక్తులు

దేవీ శరన్నవరాత్రులు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలుచోట్ల కుంకుమ పూజలు, చండీ హోమాలు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. భక్తుల తాకిడితో ఆలయాలు కిక్కిరిశాయి.

–ప్రత్తిపాడు, పొన్నూరు, పెదకాకాని, గుంటూరు రూరల్, కాకుమాను,చేబ్రోలు



నల్లపాడు అగస్త్యేశ్వరాలయంలో కనకదుర్గాదేవిగా అమ్మవారు



చల్లావారిపాలెం పుట్టలమ్మతల్లి ఆలయంలో శ్రీ కనక దుర్గాదేవిగా అమ్మవారు



కొత్తకాలనీలో దుర్గాదేవిగా అమ్మవారు



దండేశ్వరాలయంలో దుర్గాదేవిగా పార్వతీదేవి



వెనిగండ్లలో పూజలందుకుంటున్న కనకదుర్గమ్మ



వేణుగోపాలస్వామి ఆలయంలో దుర్గాదేవిగా



చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో దుర్గాదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



చేబ్రోలు నాగేశ్వరస్వామి దేవస్థానంలో దుర్గామాత అలంకారంలో పార్వతీదేవి



పెదకాకాని శివాలయంలో దుర్గాదేవి అలంకరణలో భ్రమరాంబ అమ్మవారు



నంబూరులో పూజలందుకుంటున్న కనకదుర్గమ్మ అమ్మవారు